క్లుప్తంగా

నోటు బుక్స్, పలకలు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఐతానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, పాదర్తి వెంకటేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, కోనిజేటి రమేష్ కృష్ణ, పాఠశాల హెచ్‌ఎం చావాలి స్వర్ణలత, ఉపాధ్యాయులు సుజాత, ఎంవీ రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

కరాటీ క్రీడాకారిణి లాలిత్యకు సన్మానం



తెనాలిఅర్బన్: జాతీయస్థాయి కరాటీ చాంపియన్ షిప్‌లో ప్రథమస్థానం సాధించిన వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల విద్యార్థిని, కఠెవరం గ్రామవాసి కె.లాలిత్యను మంగళవారం పలువురు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ అమరావతి షోటకాన్ కరాటీ వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం గాజువాకలో ఈ నెల 4న జాతీయ స్థాయి కరాటీ చాంపియన్ షిప్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి అశోక్, వెంకట్, కోచ్ కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణను సమర్థంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 10వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. చెత్తను వేరువేరుగా సేకరించాలని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బ్యాంకు మేనేజర్లకు పొదుపు మహిళల వినతి



తాడేపల్లిరూరల్ : డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోన్ల సందర్భంగా ప్రాసెసింగ్ చార్జీలు వసూలు చేయరాదని, గ్రూపు మహిళల పొదుపు సొమ్మును అవసరాలకు తీసుకోవడానికి ఆటంకాలు కల్పించరాదని, బలవంతంగా ఇన్సూరెన్స్ కట్టించరాదని వారికి విజ్ఞప్తి చేశారు. పొదుపు డబ్బులను డిపాజిట్ చేయడం వల్ల అవసరాలకు వాడుకోవడం తగ్గిపోతుందని, దాని వల్ల మహిళలు ప్రైవేటు ఫైనాన్స్ ఉచ్చులో పడుతున్నారని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సుధ, కళ్యాణి, జ్యోతి, కె. ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో వున్న ఇంటర్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన డిస్ట్రిక్ పూర్వ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరావు మాట్లాడుతూ వడ్డేశ్వరంలో ఉన్న కళాశాలలో మొదటి సంవత్సరం పూర్తిచేసిన ఎంపిసి, బైపిసిల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరి రెండు వేల రూపాయలు, ద్వితీయ స్థాయం సాధించిన వారికి వెయ్యి రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరికి విశేష కుంకుమార్చన



బాలాత్రిపురసుందరి అమ్మవారు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

తెనాలి: శ్రావణమాసం సందర్భంగా స్థానిక మారీసుపేటలోని బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారి దేవస్థానంలోని బాలాత్రిపురసుందరి అమ్మవారికి మంగళవారం సామూహిక విశేష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. శ్రావణమాసంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి విశేష అలంకారం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 9న ధాన్యలక్ష్మి అలంకారం, 16న వరలక్ష్మి అలంకారం, 19న శ్రావణ పౌర్ణమి రోజున గాజులతో అలంకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 23న గజలక్ష్మి, 30న సంతాన లక్ష్మి అలంకారం చేయనున్నట్లు వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కార్యదర్శి వరదా వెంకట శేషగిరిరావు, సభ్యులు పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

మానసిక రుగ్మతలపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: మానసిక రుగ్మతలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌బాబు సూచించారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పుల వలన అనేక మంది మానసిక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. జీవనశైలిలో పనిఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు. ఎవరికైనా మానసిక సమస్యలు ఉంటే వెంటనే మానసిక వైద్యులను కలవాలన్నారు. జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు పనిఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌ఎంఓ డాక్టర్ మల్లిఖార్జునరావు, ఏఓ డాక్టర్ మజీదబేగం, డాక్టర్ మధుబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.రాజేశ్వరి, ప్రోగ్రామ్ మేనేజర్ గిరిధర్, సిబ్బంది శ్రావణి, చిన్న బాలయ్య, జాస్మిన్, గాయత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో శ్రావణ మంగళవారం పూజలు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మంగళవారం ఉచిత త్రి శక్తీదేవి, మంగళగౌరి సంహిత జ్ఞాన సరస్వతి కనకమహాలక్ష్మి దేవి అమ్మవార్లకు ధార్మిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయ ప్రధాన అర్చకులు తన స్వంత నిధులతో పూజలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తెలకదేవరపల్లి మహేష్ శర్మ నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో భారీగా మహిళలు హాజరై పూజలు నిర్వహిస్తున్నటు తెలిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు లక్ష్మీ కుబేర ప్రతిమ డాలర్,రూపు రక్షాతాళ్ళను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిమ లేకుండా ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



పూజలో పాల్గొన్న భక్తులు

వక్ఫ్ బోర్డు ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలి

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును అన్ని సెక్యులర్ పార్టీలు వ్యతిరేకించాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని కోరారు. మంగళవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సవరణ వల్ల వక్ఫ్ బోర్డు తన అస్తిత్వాన్ని కోల్పోవడమే కాకుండా ఆస్తులను భారీగా కోల్పోయే ప్రమాదముందని, వక్ఫ్ సంస్థలకు ఎంతో నష్టం జరిగే అవకాశముందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ముస్లిం ఆస్తులకు కాపాడేందుకు 1954 వక్ఫ్ చట్టం తీసుకువొచ్చారని, ప్రస్తుత వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని కాపాడేందుకు ఎంటోమెంట్ రతహాలో అధికారాలు ఇవ్వాల్సింది పోయి వక్ఫ్ బోర్డు అధికారులను కుదించే విధంగా బిల్లు ప్రవేశపెట్టడం వక్ఫ్ ఆస్తులను కాజేయాలనే దురుద్దేశ్యంతోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ సైదా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

భారతీయ జీవన విధానం ప్రపంచానికి మార్గదర్శకం

ఇస్కాన్ అధ్యాపకుడు వరాహ కృష్ణ ప్రభు గురూజీ

గుంటూరు ఎడ్యుకేషన్: వేల సంవత్సరాలుగా భారతీయ జీవన విధానం సత్యం, ధర్మం, త్యాగశీలత ద్వారా ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచిందని ఇస్కాన్ అధ్యాపకుడు వరాహ కృష్ణ ప్రభు గురూజీ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల విద్యార్థులకు విలువలు–క్రమశిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గురువు కృష్ణ ప్రభు గురూజీ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి చదువుల పాఠ్యాంశాలతో పాటు తల్లిదండ్రులను, గురువులను సమాజాన్ని ప్రేమించే బోధనలకు సైతం ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. మనిషి ఆలోచనలకు, పనులకు క్రియాశీలకంగా ఉండే మెదడును చురుకుగా ఉంచడంలో ధ్యానం ప్రాధాన్యతను తెలియ చెప్పాలని సూచించారు. ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రజ్ఞను వెలికి తీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. ఇస్కాన్ కమలాకాంత దాస్ గురూజీ, రామకృష్ణ గురూజీ, పాఠశాల డైరెక్టర్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరాహ కృష్ణ ప్రభు గురూజీ

రాజవిద్య, రాజగుహ్యాయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి శ్రీమద్భగవద్గీతలోని 9వ అధ్యాయం – రాజవిద్యా రాజగుహ్యా యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానంద స్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునితో ఈ ప్రకృతి చరాచర జగత్తును సృష్టిస్తున్నానని అన్నారు.



ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: ఉపాధి హామీ కూలీలకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.95 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. 100 రోజులుపని పూర్తి అయిన ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ సత్యానందం, రెంటాల కుమారి, మేరిగ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి లిఖిత పూర్వకంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్ అర్హతగా పేర్కొన్నారని, తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో డిగ్రీ అర్హతగా ఇచ్చారన్నారు.

పేరంటాలమ్మ తల్లి దేవాలయంలో చోరీ

అమ్మవారి రెండు వెండి గొలుసులు అపహరణ

దావులూరు(కొల్లిపర): మండల పరిధిలోని దావు లూరు గ్రామంలో వేంచేసి ఉన్న పేరంటాలమ్మ తల్లి దేవాలయంలో చోరీ జరిగింది. ఆలయంలో అమ్మవారికి చెందిన రెండు వెండి గొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై ఆలయ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించగా మంగళవారం ఆలయాన్ని పరిశీలించారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ మారిస్‌పేటకు చెందిన అబ్దుల్ రజాక్‌కు షేక్ షరీఫ్‌తో ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కబేళా వంతెన వద్ద మంగళవారం అబ్దుల్ రజాక్‌పై షరీఫ్ దాడి చేశాడు. బాధితుడిని స్థానికులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. తనపై స్కూ డ్రైవర్‌తో దాడి చేశాడని బాధితుడు ఆరోపిస్తున్నాడు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొలనుకొండ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొలనుకొండకు చెందిన షేక్ మస్తాన్(35) స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చుండూరు దళిత మృత వీరులకు ఘన నివాళులు

మంగళగిరి: చుండూరు ఘటన జరిగి నేటికి 33 సంవత్సారాలు గడిచిన మృతికి కారణమైన వారికి నేటికి శిక్ష పడకపోవడం సమాజంలో అగ్రవర్ణాల ఆధిపత్యం ఎలా కొనసాగుతుందో అర్థం అవుతుందని ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు తెలిపారు. పట్టణంలోని పార్కు రోడ్డులో కల ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యలయంలో మంగళవారం చుండూరు మృత వీరుల జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు చార్వాక, మేడం భాగ్యరావు, విద్యాసాగర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విద్యార్థి ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారం 3వలైనుకు చెందిన పవన్ బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. యాప్ నిర్వాహకులు సకాలంలో అతడికి లాభాలు రుచి చూపించారు. దీంతో పవన్ వరసగా ఎక్కువ మొత్తం పెట్టుబడి పెడుతూ వచ్చాడు. చివరకు యాప్ నిర్వాహకులు అసలు, లాభం రెండూ చెల్లించలేదు. మొత్తం రూ.2.35 లక్షలు మోసపోయినట్లు పవన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణే పరిష్కరించాలని ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నగరంపాలెంలోని పోస్టల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆల్ ఇండియా పోస్టల్, ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ 15 డిమాండ్లకు వెంటనే ఆమోదం తెలపాని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని శాఖల అసోసియేషన్లు సమష్టి కృషితో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యతే అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. ధర్నా లో పోస్టల్ గుంటూరు డివిజన్ కార్యదర్శులు వి.మోహన్‌రావు, బి.రామారావు, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

పేద ప్రజల గొంతుకై నిలిచిన గద్దర్

జై భీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు దేవయ్య



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దేవయ్య, సందీప్, తదితరులు



ఐక్యవేదిక కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కిరణ్, అబ్రహం లింకన్, తదితరులు

తెనాలిఅర్బన్: పేద ప్రజల పక్షాన నిలిచి వారికి అండగా ఉన్న ప్రజాయోధుడు గద్దర్ అని జై భీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు కఠెవరపు దేవయ్య కొనియాడారు. గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రజాకవి గద్దర్ ప్రథమ వర్థంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి గద్దర్ చేసిన కృషి మరువరానిదన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా ఆ ప్రాంత ప్రజలను సంఘటిత పరిచి బాధితుల పక్షాన నిలిచేవారని గుర్తుచేశారు. అలాగే తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. కారంచేడు, చుండూరు ఉద్యమాలకు ఆయన ఊపిరి పోశారని కొనియాడారు. దళిత మహాసభ రాష్ట్రనాయకుడు చిట్టాకుల క్రాంతి మాట్లాడుతూ ఎన్నోసార్లు గద్దర్ తెనాలిలో పర్యటించి ఉద్యమ గళాన్ని వినిపించారని గుర్తు చేశారు. తెనాలిలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మదిర శేషయ్య, సందీప్, బేతాళ భూషణం, రామారావు, పీటర్, తదితరులు పాల్గొన్నారు.

- రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక కార్యాలయంలో గద్దర్ ప్రథమ వర్థంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్‌లు మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన మహానీయుడు గద్దర్ అని కొనియాడారు. తన రచనల ద్వారా, ఉద్యమాల ద్వారా ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అంబేడ్కర్ వాదాన్ని పుణికి పుచ్చుకుని ఆయన ఆశయ సాధనకు గద్దర్ కృషి చేశారని తెలిపారు. బేతాళ భూషణం, సందీప్, కె.ఎజ్రా, ఉన్నవ రాజేష్, కనపర్తి రాజేష్, బడుగు నరేంద్ర, చార్వాక, క్రాంతి, రోజన్‌బాబు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రణరంగ చౌక్ వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సభకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. అలాగే పెద్దసంఖ్యలో ప్రజలు కూడా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మేనేజర్ అప్పలరాజు, ఏసీపీ సుబ్బారావు, ఆర్‌ఓ సోమశేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అమరులకు ఘననివాళి



రక్తక్షేత్రం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

తెనాలిఅర్బన్: చుండూరు మరణకాండ జరిగి 33 సంవత్సరాలు అయిన నేపథ్యంలో ఆ గ్రామంలోని రక్తక్షేత్రం వద్ద మంగళవారం అమరులకు దళిత సంఘ నాయకులు నివాళులర్పించారు. అమరుల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 33 సంవత్సరాల క్రితం చుండూరు లో జరిగిన మరణాకాండను దేశం ఎన్నటికీ మరువదని తెలిపారు. మరణకాండలో మృతి చెందిన వారికి తమ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, అంబేడ్కర్ ఇండియా మిషన్ జోనల్ ఇన్‌చార్జి మదిర శేషయ్య, డి.సందీప్, కె.దేవానాంద్, బేతాళ భూషణం, ఉన్నం సల్మాన్, ఎజ్రా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలిచిన సీపీఎం నాయకులు



పొక్లెయిన్లు ఆపి ధర్నా నిర్వహిస్తున్న కార్మికులకు మద్దతుగా నిలిచిన సీపీఎం, సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ భూములు చదును చేయడానికి ప్రొక్లయిన్లు రావడంతో కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు తదితర నాయకులు కార్మికులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఆర్డరు ఉన్నా కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా భూములను చదును చేయడానికి వీలు లేదన్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కోర్టు ఆర్డర్లను లెక్కచేయకుండా ఎసిసి భూముల్లో ప్రొక్లయిన్లను పంపి కార్మిక కుటుంబాల జీవితాలతో ఎస్‌ఆర్‌ఐ యజమానులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. బకాయిలు చెల్లించే వరకు పోరాడతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఎస్‌ఆర్‌ఐ ప్రతినిధి ఘటనా స్థలానికి చేరుకుని కార్మికుల న్యాయమైన కోర్కెలు విని ప్రొక్లయిన్లు వెనక్కు తీసుకుంటామని, చదును చేయడం ఆపివేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె. స్టీవెన్, వై. యెహోషువా, వై. సుబ్బారావు, నవనీతం, గౌరమ్మ, హిమాంబ, రమాదేవి, బి. అంకయ్య, బి. సూర్యప్రకాష్,నాగేశ్వరరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సహజ కాన్పులు పెంచేందుకు కృషి చేయాలి



శిక్షణ పొందిన వారితో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: సహజ కాన్పుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డులోని సమావేశ మందిరంలో సహజ కాన్పుల్లో శిక్షణ పొందిన మిడ్ వైఫరీ, ఎడ్యుకేటర్స్ మిడ్ వైఫరీ డైరెక్టర్ సారాతో కలసి మంగళవారం ఆయన సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీల సంఖ్య పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పురిటినొప్పులు భరించలేక కొంతమంది ఇబ్బందులు పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని సహజ కాన్పులు అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సాధారణ కాన్పులు చేసే విధంగా శిక్షణ పొందినవారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిడ్ విఫరీ ప్రతినిధి భీమారాయ్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ పి.బేబీ, పి.అపర్ణ, జి.ప్రశాంతి పాల్గొన్నారు.